కొనుగోళ్లు వెంటనే ప్రారంభించాలి

- కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్
- కొనుగోలు కేంద్రాల తనిఖీ
- 'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన

కేసముద్రం, నవంబర్ 20: ధాన్యం కొనుగోళ్లను వెంటనే ప్రారంభించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. 'ప్రారంభించారు.. కొనుగోళ్ల మరిచారు.' శీర్షిక బుధవారం 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ స్పందించారు. మండలంలోని ఉప్పరపల్లి, కేసముద్రం విలేజీ, కోరుకొండపల్లి, కల్వల గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను బుధవారం తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రంలోని ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించారు. కొనుగోలు కేంద్రంలోని రికార్డును పరిశీలించారు. తేమశాతం తక్కువగా ఉన్నా ఎందుకు కొనుగోళ్లు చేపట్టడం లేదని సెంటర్ నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. వెంటనే కొనుగోళ్లు ప్రారంభించాలని, బస్తాల తరలింపులోనూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఓపీ ఎమ్మెస్ ఆన్‌లైన్ విధానంలో రైతుల వివరాలను నమోదు చేసి డబ్బులను ఖాతాల్లో జమ అయ్యేలా చూడాలన్నారు. డీటీ ఎర్రయ్య, ఏవో వెంకన్న, సీఈవో వెంకటాచలం, ఈవోపీఆర్‌డీ హరిప్రసాద్, ఈవో అశోక్, కార్యదర్శి అరుణ్‌జ్యోతి, ఏఈవోలు రవివర్మ, రాజేందర్, లావణ్య ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రంలో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు

గూడూరు: కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలిగించొద్దని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ నిర్వాహకులకు సూచించారు. మండలంలోని గూడూరు, అయోధ్యపురంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు, సౌకర్యాలపై రైతులను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో మాట్లాడుతూ రైతులు ఇబ్బందులు పడకుండా అన్ని వసతులు కల్పించాలన్నారు. ఓపీఎంఎస్ ఆన్‌లైన్ విధానం ద్వారా రైతుల వివరాలను నమోదు చేసి ధాన్యం డబ్బులు వారి ఖాతాలో జమ అయ్యేలా చూడాలని సూచించారు. తహసీల్దార్ శ్వేత, రైతులు పాల్గొన్నారు.

పొంగిన భగీరథ ట్యాంకు నీరు

- నిండాక ఆఫ్ చేయడంలో నిర్లక్ష్యం
- కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం

కురవి, నవంబర్ 20: ఆరుగాలం కష్టపడి ధాన్యాన్ని పండించిన రైతులకు నష్టం ఏ రూపంలో వస్తుందో తెలియదు. మిషన్ భగీరథ వాటర్ ట్యాంకుకు ఎక్కించిన నీళ్లు పొంగిపోవడంతో ధాన్యం తడిసిముద్దయ్యాయి. ఈఘటన మంగళవారం మండల కేంద్రంలో రాత్రి జరిగింది. స్థానిక నాగుమయ్య దేవస్థానం ఆవరణలో కురవి సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న కొనుగోలు కేంద్రంలో రైతులు ధాన్యాన్ని మూడు రోజులుగా తీసుకొచ్చి ఆరబెట్టుకుంటున్నారు. ఇక్కడే మిషన్ భగీరథ ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకు ఉంది. రోజూ మాదిరిగానే భగీరథ వాటర్ బాయ్ నీటిని ట్యాంకుకు ఎక్కించాడు. నిండిన తర్వాత ఆఫ్ చేయడంలో నిర్లక్ష్యం వహించాడు. దీంతో వాటర్‌ట్యాంకు మంగళవారం రాత్రంతా నీటి పొంగి వరద ప్రవాహం పోయింది. ఈ క్రమంలో ధాన్యం రాసులు తడిశాయి. విష యం తెలుసుకున్న రైతులు అదే రాత్రి వచ్చి తడిసిన ధాన్యాన్ని చూశారు. ధాన్యం రాసుల కింద నీళ్లు ఉన్నాయి. బుధవారం ఉదయం వచ్చి ధాన్యాన్ని తీసి ఆరబెట్టుకున్నారు. భగీరథ నీటిని ట్యాంకులోకి నింపి నిండిన తర్వాత ఆఫ్ చేయకుండా వదిలేయడంతో ధాన్యం తడిసింది. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి తమను ఆదుకోవాలని రైతులు కోరారు.

ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్న మహిళా రైతు

కొనుగోలు కేంద్రం వద్ద వాటర్ ట్యాంకు

చైన్ స్నాచింగ్ కేసులో నిందితుడి అరెస్ట్

జనగామ చౌరస్తా, నవంబర్ 20 : చైన్ స్నాచింగ్ కేసులో పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు. అర్బన్ పీఎస్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో ఏసీపీ పార్థసారథి వివరాలు వెల్లడించారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం బక్కరుప్పుల తండాకు చెందిన కేలోత్ సాయికృష్ణ గత ఏడాది జనగామ ఏబీవీ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ (ఎంపీసీ) పూర్తి చేశాడు. ఉద్యోగ సాధన కోసం దిల్‌సుఖ్‌నగర్, విజయవాడ ప్రాంతాలకు వెళ్లి ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బానిసై డబ్బులు పోగొట్టుకున్నాడు. తల్లి దండ్రులతో గొడవ పడి గత నెల 14వ జనగామకు వచ్చి డిగ్రీ చదివే సమయంలో ఎస్సీ హాస్టల్‌లో మకాం వేశాడు. కాలేజీ అడ్మిషన్ లేకుండా హాస్టల్‌లో ఉండొద్దని వార్డెన్ చెప్పడంతో ఏబీవీ కళాశాలలో పీజీ అడ్మిషన్ కోసం ఈనెల 4న వెళ్లాడు. అక్కడ దివ్యాంగుడైన రికార్డ్ అసిస్టెంట్(ఇన్‌చార్జి లైబ్రేరియన్) భూక్యా ఉపేందర్‌ను గమనించాడు. సులభంగా డబ్బులు సంపాదించాలని మరుసటి రోజు కళాశాల లైబ్రరీ తాళం తీసే సమయానికి చేరుకుని దివ్యాంగుడైన ఉపేందర్‌పై దాడిచేసి అతడి మెడలోని 10 గ్రాముల బంగారు గొలుసును సాయికృష్ణ లాక్కొని బైక్‌పై పరారయ్యాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు సీసీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేసిన పోలీసులు నిందితుడు సాయికృష్ణను అరెస్ట్ చేశారు. నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన అర్బన్ సీఐ దామోదర్‌రెడ్డి, ఎస్సై భరత్‌ను ఏసీపీ అభినందించారు.

మాజీ ఎమ్మెల్సీ రామయ్యను కలిసిన ఎర్రబెల్లి

తొర్రూరు, నవంబర్ 20: మాజీ ఎమ్మెల్సీ, ప్రముఖ విద్యావేత్త చుక్కా రామయ్యను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు బుధవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి 98వ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ ప్రముఖ విద్యావేత్త చుక్కా రామయ్య సామాజిక ఉద్యమకారుడు, మాజీ శాసన మండలి సభ్యుడిగా ఎన్నో సేవలు అందించారని గుర్తుచేశారు. ఆయన జనగామ జిల్లా గూడూరులో జన్మించారని తెలిపారు. ఐఐటీ శిక్షణా కేంద్రాన్ని స్థాపించి ఎంతో మంది విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపారని పేర్కొన్నారు. ఐఐటీ శిక్షణలో మంచి పేరు సంపాదించి ఐఐటీ రామయ్యగా గుర్తింపు పొందారని చెప్పారు. ఐఏఎస్ అధికారి బుర్రా వెంకటేశ్వర్లు, వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రవీందర్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్సీ రామయ్యకు బొకే అందిస్తున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

కురవి(సీరోలు), నవంబర్ 20: కావాలని ట్రాక్టర్ ఢీకొట్టి హత్య చేసిన కేసులో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై నగేశ్ తెలిపారు. ఈనెల 15న సీరోలు మండల కేంద్రంలో ద్విచక్రవాహనంపై పొలం పనులకు వెళ్తున్న గంగారపు సుధాకర్‌ను పాత పగతో అదే గ్రామానికి చెందిన పత్తి అంతయ్య ట్రాక్టర్ ఢీకొట్టి చంపాలని చూశాడు. పలువురు గమనించడంతో పరారయ్యాడు. సుధాకర్ ఫిర్యాదు మేరకు అంతయ్యను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై తెలిపారు.

పరామర్శించడం నేరమా?

కురవి, నవంబర్ 20: లగచర్ల ప్రాంత గిరిజన రైతు కుటుంబాలను పరామర్శించడం నేరమా? అని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు మాలోత్ కిషన్‌నాయక్ బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. లగచర్ల రైతుల కుటుంబాలను పరామర్శించేందుకు వెళ్తున్న గిరిజన సంఘాల నాయకులను అక్రమంగా అరెస్ట్ చేయడం దారుణమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నియంతృత్వ ధోరణి వీడాలని హితవుపలికారు. పోలీస్ స్టేషన్లలో ఉన్న గిరిజన నేతలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

కేసముద్రం, నవంబర్ 20: ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నజీర్‌అహ్మద్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులందరికీ రుణమాఫీ చేస్తామని మోసం చేసిందన్నారు. ధాన్యానికి బోనస్ ఇస్తామని అధికారంలోకి వచ్చాక సన్న రకం ధాన్యానికి ఇస్తోందని తెలిపారు. రైతు భరోసా పేరుతో పెట్టుబడి డబ్బులు ఇవ్వకపోవడంతో రైతులు పెట్టుబడులకు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి నష్టపోతున్నారని పేర్కొన్నారు. గురువారం మహబూబాబాద్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరయ్యే రైతుదీక్షకు అధిక సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ నాయకులు నీదం దుర్గేశ్, రావుల శ్రీనాథ్‌రెడ్డి, కముటం శ్రీనివాస్, గుగులోత్ వీరూనాయక్, బిర్రు వెంకన్న, బుర్ర కుమార్ ఉన్నారు.

రైతులతో కలిసి పొలం దున్నుతున్న ఏవో స్వామి

నాగలి పట్టిన వ్యవసాయ అధికారి

పెద్దవంగర, నవంబర్ 20: ప్రభుత్వ అధికారులు ప్రజా సేవలో ఇలా కూడా ఉంటారా! అనే రీతిలో ఓ అధికారి రైతులకు సేవలందిస్తూ ప్రశంసలు అందుకుంటున్నారు. బుధవారం మండలంలోని గంట్లకుంట శివారులోని అమర్ సింగ్ తండాలో గిరిజన రైతులు మక్కజొన్న విత్తనాలను వేస్తుండగా మండల వ్యవసాయ అధికారి స్వామి పలు సూచనలు చేశారు. స్వయంగా నాగలి దున్నుతూ విత్తనాలను ఇంత లోతులో వేస్తే సమృద్ధిగా మొలకెత్తుతాయని చెప్పారు. మక్కజొన్న సాగులో యాజమాన్య పద్ధతులు, ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఏఈవోలు యశస్వినీ, రాజు, విశ్వశాంతి ఉన్నారు.

ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తా

ఎమ్మెల్యే మురళీ నాయక్

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 20 : మానుకోట పట్టణాన్ని ప్రణాళికబద్ధంగా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. బుధవారం పట్టణంలోని 29వ వార్డ్‌లో రూ.10లక్షలతో చేపట్టే జనరల్ ఫండ్‌తో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ మానుకోటలో అన్ని వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీలకు నిధులను మంజూరు చేయించినట్లు తెలిపారు. మార్నేని వెంకన్న సూర్జపు సోమయ్య, పోతురాజు, సునీత, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నెల్లికుదురు: శ్రీరామగిరిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

దళారులను నమ్మొద్దు

నెల్లికుదురు: రైతులు దళారులను నమ్మొద్దని ఎమ్మెల్యే బానోత్ మురళీనాయక్ సూచించారు. మండలంలోని శ్రీరామగిరి సొసైటీ ఆధ్వర్యంలో ఆలేరు, శ్రీరామగిరి, మదనతుర్తి, రావిరాల గ్రామాల్లో, ఎర్రబెల్లిగూడెం సొసైటీ ఆధ్వర్యంలో ఎర్రబెల్లిగూడెం, మేచరాజుపల్లిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధరను పొందాలని తెలిపారు. శ్రీరామగిరి సొసైటీ చైర్మన్ గుండ వెంకన్న, ఎర్రబెల్లిగూడెం సొసైటీ చైర్మన్ దేవేందర్ రావు, ఏవో ఎస్‌కే యాస్మిన్, ఏఈవో మణికంత, నాయకులు నాయిని సత్యపాల్‌రెడ్డి, గుగులోత్ బాలాజీ నాయక్, ఎదళ్ల యాదవ రెడ్డి, గొల్లపల్లి ప్రభాకర్, జెల్ల వెంకటేశ్, పట్నంశెట్టి నాగరాజు, వెంకట్‌రెడ్డి, రామారావు, వలబోజు వెంకటేశ్వర్లు, కొప్పు శ్రీను పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

నర్సింహులపేట, నవంబర్ 20: కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే జాటోత్ రామచంద్రునాయక్ అన్నారు. బుధవారం మండలంలోని వంతడపల, ముంగిముడుగులో ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఏ గ్రేడ్‌కు రూ.2,320, సీ గ్రేడ్‌కు రూ. 2,300 గిట్టుబాటు ధర పొందాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మిన రైతులకు కొనుగోలు తర్వాత క్వింటాకు రూ.500 బోనస్ అందిస్తామన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి 15 రోజుల్లో డబ్బులు అందించనున్నట్లు చెప్పారు. తహసీల్దార్ నాగరాజు, ఏవో వినయ్‌కుమార్, ట్రాన్స్‌కో ఏఈ పాండు, ఏపీఎం వీరయ్య, సీసీ భీముడు, నాయకులు రమేశ్, రాజశేఖర్, లింగారెడ్డి ఉన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామచంద్రునాయక్

రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు

కురవి(సీరోలు), నవంబర్ 20: కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలిగించొద్దని నిర్వాహకులకు సీరోలు మండల వ్యవసాయాధికారిణి చాయారాజ్, కాంపల్లి సొసైటీ చైర్‌పర్సన్ కొండపల్లి శ్రీదేవి అన్నారు. బుధవారం మండలంలోని పలు కేంద్రాలను సందర్శించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఏఈఓలు రైతులకు కూపన్లు ఇచ్చిన తర్వాతే వడ్లు కాంటా వేయాలని సూచించారు. రైతులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం వడ్లు తీసుకురావాలని చెప్పారు. ఏఈవో రమేశ్, సముద్రాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

పరిశీలించిన ఏవో చాయారాజ్, కాంపల్లి సొసైటీ చైర్‌పర్సన్ కొండపల్లి శ్రీదేవి

సాగులో మెళకువలు పాటించాలి

గంగారం, నవంబర్ 20: రైతులు సాగులో మెళకువలు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి విజయనిర్మల అన్నారు. బుధవారం మండలంలోని పెద్ద ఎల్లాపురం, మామిడిగూడెంలో పొద్దుతిరుగుడు, మిర్చి పంటలను పరిశీలించి తులకు పలు సూచనలు చేశారు. కోమట్లగూడెం, గంగారంలోని రైతు ఆగ్రోస్ కేంద్రాలను తనిఖీ చేశారు. గోదాంలోని ఎరువులు, విత్తనాలను పరిశీలించి రైతులకు అందుబాటులో ఉండి విత్తనాలు, ఎరువులు అందించాలని చెప్పారు. స్టాక్ బోర్డులో ధరల వివరాలను ప్రదర్శించాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారి రాంబాబు, ఏఈవో ధరణీశ్, కిషోర్, సింధు, తహసీల్దార్ సత్యనారాయణ పాల్గొన్నారు.

పొద్దుతిరుగుడు పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల

బాధిత కుటుంబాలకు పరామర్శ

ఇనుగుర్తి, నవంబర్ 20: మహబూబాబాద్ మాజీ ఎంపీ, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత బుధవారం బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఇనుగుర్తి మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు ఓరుగంటి సూరయ్య (55) ఇటీవల గుండెపోటుకు గురై మృతిచెందాడు. మృతుడి చిత్రపటానికి కవిత పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పీఏసీఎస్ చైర్మన్ డీకొండ వెంకన్న, బీఆర్ఎస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బొబ్బిలి మహేందర్‌రెడ్డి, గండు నాగన్న, మాలోత్ మంగ్యనాయక్, గాడుదుల రాజాలు, గుండ్రపల్లి దేవేందర్, మనోజ్, కృష్ణా, మహేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీకి..

కురవి/ గూడూరు : కురవి మండల మాజీ ఎంపీపీ గుగులోత్ పద్మావతి మామ, బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు గుగులోత్ రవికుమార్ నాయక్ తండ్రి ఇర్యానాయక్ బుధవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎంపీ మాలోత్ కవిత వేర్వేరుగా పార్థివదేహాన్ని సందర్శించారు. పూలమాల వేసి నివాళులు అర్పించారు. మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపుడి నవీన్ రావు, కురవి సొసైటీ చైర్మన్ దొడ్డ గోవర్ధన్ రెడ్డి, గంగాధర్ రెడ్డి, గణేశ్, రమేశ్ పాల్గొన్నారు. గూడూరు మాజీ ఎంపీటీసీ, బీఆర్ఎస్ మండల నాయకుడు బాదావత్ రజిత సోము కుటుంబాన్ని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత బుధవారం పరామర్శించారు. సోము తల్లి అయిలమ్మ ఈనెల 15న మరణించింది. దీంతో కవిత బుధవారం పోనుగోడులోని సోము ఇంటికి వెళ్లి పరామర్శించారు. మాజీ వైస్ ఎంపీపీ ఆరె వీరన్న, పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం సంపత్‌రావు, మండల ప్రధాన కార్యదర్శి నూకల సురేందర్, జిల్లా నాయకుడు కఠార్ సింగ్, మాజీ మండల కో ఆప్షన్ సభ్యుడు రహీం, మీడియా ప్రతినిధి నర్సింహనాయక్ పాల్గొన్నారు.

ఇనుగుర్తి: మృతుడికి నివాళులు అర్పిస్తున్న మాజీ ఎంపీ కవిత

కురవి: నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్

రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 20 : రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ అన్నారు. బుధవారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లక్షల మంది కార్మికులు రవాణా రంగంపై ఆధారపడి స్వయం ఉపాధి పొందుతున్నారని, ఎక్కువ మంది ప్రైవేట్ ఫైనాన్స్ తీసుకుని నడుపుతున్నారని, కానీ ప్రభుత్వం నుంచి ఎలాంటి సంక్షేమ పథకాలు అందటం లేదన్నారు. ప్రభుత్వం తగిన భద్రతను కల్పించాలని డిమాండ్ చేశారు. శ్రీనివాస్‌రెడ్డి, నాగన్న, వెంకన్న, ఐలయ్య, విజయ్, ఉపేందర్ పాల్గొన్నారు.

కేసీఆర్‌తోనే పల్లెల్లో సమగ్రాభివృద్ధి

మాజీ సర్పంచ్ బోయినపల్లి వెంకన్న

డోర్నకల్, నవంబర్ 20: కేసీఆర్, మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్‌తోనే పల్లెల్లో సమగ్రాభివృద్ధి జరిగిందని మాజీ సర్పంచ్ బోయినపల్లి వెంకన్న అన్నారు. బుధవారం వెన్నారం గ్రామంలో బోయినపల్లి మల్లయ్య గౌడ్, ప్రసాద్‌కు బీఆర్ఎస్ కండువా కప్పి బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పాలనలో సబ్బండ వర్గాలకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందాయన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని గెలిపించుకోవాలన్నారు. బీఆర్ఎస్ నాయకుడు అన్నపర్తి సైదులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కండువా కప్పుతున్న మాజీ సర్పంచ్ వెంకన్న

రైతులు పశువుల పెంపకాన్ని చేపట్టాలి

కేసముద్రం, నవంబర్ 20: రైతులు పాడి పశువుల పెంపకాన్ని చేపట్టాలని పశువైద్యాధికారి విజయ్‌కుమార్ సూచించారు. పశు గణాభివృద్ధి, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మండలంలోని అర్పనపల్లిలో బుధవారం ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించారు. 136 పశువులకు వైద్య పరీక్షలు చేశారు. నట్టల నివారణకు మందులు అందించారు. ఆయన మాట్లాడుతూ ఆడ దూడలు పుట్టే లింగ నిర్ధారణ చేసిన సెక్స్ సార్టెడ్ సెమన్ అందుబాటులో ఉందని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలన్నారు. పశువుల పేడను ఎరువుగా ఉపయోగించి వ్యవసాయం చేస్తే పంటలకు ఎరువులు, క్రిమిసంహారక మందుల వాడకం తగ్గి, దిగుబడి అధికంగా వస్తుందన్నారు. రఘువీర్, సుధాకర్, సుభాని ఉన్నారు.

జాతీయ సెపక్ తాక్ర పోటీలకు ఎంపిక

నెల్లికుదురు, నవంబర్ 20: నాగాలాండ్ రాష్ట్రం కోహిమాలో జరిగే జాతీయస్థాయి సెపక్ తాక్ర పోటీలకు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని అక్కెర సుచిత్ర ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు రవి తెలిపారు. ఆ విద్యార్థినిని బుధవారం ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించారు. ఈనెల 16 నుంచి 18 వరకు మండల కేంద్రంలోని నిర్వహించిన 68వ స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి పోటీల్లో సుచిత్ర పాల్గొని ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైందని హెచ్ఎం తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ పొన్నం మమత, ఫిజికల్ డైరెక్టర్ చెడుపల్లి ఐలయ్య, పాఠశాల స్టాఫ్ సెక్రటరీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సుచిత్రను సన్మానిస్తున్న హెచ్ఎం రవి, ఉపాధ్యాయులు

దుర్గా భవానీకి ఇండియా ఎక్సలెన్స్ అవార్డు

తొర్రూరు, నవంబర్ 20: మండలంలోని సోమారం గ్రామానికి చెందిన కాకిరాల దుర్గాభవానీ ప్రతిష్ఠాత్మక ఇండియా ఎక్సలెన్స్ అవార్డు అందుకున్నారు. వివిధ రంగాల్లో ప్రతిభావంతులను గుర్తించి ఇండియా ఎన్‌క్లేవ్ అవార్డులను హైదరాబాద్‌లో ప్రదానం చేసింది. ప్రపంచవ్యాప్తంగా అందుబాటులోకి వస్తున్న కృత్రిమ మేధ (ఏఐ)పై విస్తృతపరిశోధనలు చేసిన మండలవాసి దుర్గాభవానీ పరిశోధనలను గుర్తించిన కమిటీ 2024లో ఉత్తమ పరిశోధకురాలిగా అవార్డు ప్రదానం చేసింది. దుర్గాభవానీ తొర్రూరు పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్ కుమార్తె.

అవార్డు అందుకుంటున్న దుర్గాభవానీ

ఉచిత కంటి పరీక్ష శిబిరం

కురవి, నవంబర్ 20: మండలంలోని నేరడ గ్రామంలో డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్ గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని బుధవారం గ్రంథాలయ చైర్మన్ ఎస్‌కే జానీ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని నిర్వహించారు. 120 మందికి వైద్య పరీక్షలు చేశారు. రూ.5వేల విలువైన కంటి చుక్కల మందులు, టాబ్లెట్ లను డాక్టర్ మధుసూదన్ ఉచితంగా అందజేశారు. 30 మందికి కంటి ఆపరేషన్ అవసరం ఉన్నట్లు గుర్తించారు. జాతీయ ఉద్యమంలో గ్రంథాలయాల పాత్ర అనే అంశంపై నేరడ హైస్కూల్‌లో విద్యార్థులకు వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. పాఠశాల హెచ్ఎం బాలాజీ, డాక్టర్ మధుసూదన్, జక్కుల మల్లయ్య, వేలాద్రి, ఉపాధ్యాయులు, ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

కంటి పరీక్షలు చేస్తున్న మధుసూదన్

సీపీఆర్ చేసి.. కోతిని బతికించి..

సీరోలు పోలీస్‌స్టేషన్ ఆవరణలో విద్యుదాఘాతానికి గురై స్పృహ తప్పిన కోతిని సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడిన సీరోలు గ్రామ యువకుడు అడిగే నాగరాజు.

– కురవి(సీరోలు), నవంబర్ 20

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED
★ హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899 / 9640468899.
NT-338964-AII

CHANGE OF NAME
I, KUNDURU LAXMI R/o H.No. 2-219/1, Nehru Nagar, Madikonda, Kazipet Mandal, Hanumakonda Dist TG, Have Changed my name from KUNDURU SRILAXMI To KUNDURU LAXMI and Solemnly Declare.

WANTED HOSPITAL STAFF
★Operation Theater Boys, Medical Shop Assts. & Computer Operators/Administrators /Supervisors Required Cont: Guardian Hospital, Mulugu 'X' Road, Wgl. 12 to 2 pm
NTW-450

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్
★ సెప్టిక్ ట్యాంక్ క్లినర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్పర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-326503

CHANGE OF NAME
★ I, SANTOSH JOSHI R/o H.No. 5-9-58, Lashkar Bazar, Hanamkonda, Hanumakonda Dist. TG, Have Changed my name from SANTOSH BAI JOSHI To SANTOSH JOSHI and Solemnly Declare.
NTW-000

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం: 9182777552
HANAMKONDA 9182777563 9182777961
WARANGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565